# "జవాబు లేని ప్రశ్న"

— మార్గాన మహేశ్

శాంతి చదువుకోనిదేం కాదు. మరీ అంత ఎక్కువగా చదివిందీ కాదు. హైస్కూలు చదువుతో సరిపెట్టేసింది. కాలేజీ మెట్లు ఎక్కనివ్వలేదు ఇంట్లోవాళ్ళు అలాగే. శాంతి అపరంజి బొమ్మకాదు ఆణిముత్యంలా ఉండదు. అయినా చూట్టానికి కనులకింపుగానే ఉంటుంది. పద్దెనిమిదేళ్ళు నిండిన శాంతికి పెళ్ళి చేసేయాలని వాళ్ళ బామ్మ పట్టుదల. శాంతి పెళ్ళి చూస్తేనే గాని తను ఇహలోకంనుండి పరలోకానికి ప్రయాణంకాదట.

ఇంటిపనంతా చకచకా చేసేసి వీలు చిక్కినపుడల్లా, ఇంటిముందు వరండాలోని కెళ్ళి అక్కడున్న తెల్లటి స్థంభాన్నానుకొని, కాలేజీకి వచ్చేపోయే అమ్మాయిల్నీ, అబ్బాయిల్నీ చూస్తూండడం శాంతికి అలవాటు. అలా చూస్తూ ఎంతసేపైనా నించోగలదు శాంతి. కాని శాంతి అలా నించున్నపుడల్లా వాళ్ళ బామ్మకి ఏదో పని చెప్పాలని బుద్ధి పుడుతుంది.

"ఒసేయ్ శాంతీ. ఏం చేస్తున్నావే అక్కడ? ఈ ముసల్ది ఇక్కడెలా చచ్చినా నీకేం ఫరవాలేదే తల్లీ....ఔనూ, నాకు తెలీకడుగుతాను, ఆ స్థంభాన్ని పట్టుకు నించుని ఏమిటే నువ్వాలోచించేదీ?.... ఈ బీరకాయలు కాస్త కోసిపెట్టవే తల్లీ, నా నడుం పడిపోతోందే ఈ చాకిరీ చెయ్యలేక...." అనేది వాళ్ళ బామ్మ.

"ఏమే శాంతి అలా ఊరికే నించో పోతే ఈ బియ్యం కాస్త యేరి పెట్టకూడదుటే" అని వాళ్ళమ్మ. శాంతి అక్కణ్ణుంచి కదిలే వరకూ పనులు పురమాయిస్తూ పిలుస్తూనే వుండేది.

శాంతి ఆ రోజు చాలా ఉత్సాహంగా ఉంది. తమ్ముడు గోపి గోల పెడుతున్నా, వాడి సంగతే మరచిపోయి, తెల్లటి ఆ స్థంభానికి దగ్గరగా వెళ్ళింది. ఏదో తెలీని ఉత్సాహంతో మనస్సు గాలిలో తేలిపోతోంది. కళ్ళు మట్టుకు ఎవరినో వెతుకుతున్నాయి.

టైము తొమ్మిదిన్నరయింది. రోడ్డంతా కాలేజి విద్యార్థులతో కళ కళ లాడుతోంది.

శాంతి కళ్ళు ఒక్కసారిగా మెరిశాయి. అందుక్కారణం, రోజూ కనిపించే ఆ ఉంగరాల జుట్టు అబ్బాయి, ఆ అమ్మాయి వచ్చి, సరిగ్గా శాంతి ఇంటి ముందు కలుసుకోవడం.

"లీలా, రేపట్నుండి శలవులు" విచార స్వరంతో అన్న అతని మాటలవి.

"ఊరికెళ్తున్నావా మధు?" అంతకు రెట్టించిన విచారంతో అందామె

"తొందరగా వచ్చేస్తావు కదూ? మళ్ళీ తనే అడిగింది.

"తప్పకుండా....కాని...."

"కాని....ఏమిటి మధూ?"

వారం రోజులైనా ఉండకపోతే రానివ్వరు కదా? ఎలాగా అని ఆలోచిస్తున్నాను.

చిరునవ్వు తొణికిసలాడుతున్న పెదవులతో ఆమె చెప్పిన సమాధానం—

"ఐతే అలానే వుండు మధూ. తల్లిదండ్రుల ఆనందం కంటేనా?"

"నే నెక్కడున్నా నా మనస్సెప్పుడూ నీ చుట్టూ తిరుగుతూనే ఉంటుంది లీలా. ఆ రోజు చూపించావే నీ ఫొటో, సాయంత్రం పార్కుకి వచ్చేటప్పుడు మర్చిపోకుండా తీసుకురా.... మర్చిపోవుకదూ"

భారంగా అడుగు లేసుకుంటూ వెళ్ళిపోయారిద్దరూ

ఇదంతా గమనిస్తున్న శాంతి ఆలోచనల్లో పడింది. శాంతి మనస్సంతా సందేహాలతో నిండిపోయింది.

"కలుసుకునేటపుడు వాళ్ళ కళ్ళల్లో కన్పించే తళుకు విడిపోయినపుడు ఎక్కడికి మాయమైందో? వారం రోజుల ఎడబాటు సహింపరానిదై పోయిందే? పాపం!"

తనూ కాలేజీకి వెళ్ళుంటే .... తనూ ఎవర్నో ప్రేమిస్తోందేదా? ప్రేమంటే ఏమిటి? ప్రేమంటే ఏదో తెలీని ఒక తియ్యటి అనుభూతి అని ఎక్కడో చదివినట్లు గుర్తు. నిమ్మకాయ పచ్చడి గుర్తొచ్చేసరికి నోరూరినట్టు మనసుకు నచ్చినవాడు కనబడగానే ప్రేమ పొంగి పొరలుతుందిగాబోలు! ఐతే, మరి కాలేజిలో ఎంతో మంది అమ్మాయిలు, అబ్బాయిలతో మాట్లాడుతూంటారు గదా. వాళ్ళంతా ప్రేమించుకుంటున్నట్లేనా?" ప్రేమంటే 'త్యాగం' అంటారు .... అబ్బ ఏమిటో ఈ ప్రేమ.... అంతా పిచ్చి" తరువాత ఆలోచనలు సాగలేదు ఆమెకు

సాయంత్రం ఎదురింటి శారద ఇంటికి వెళ్ళాలన్పించింది శాంతికి. శారద నిజంగా ఎంత అదృష్టవంతురాలు. శారద బి. ఎ. ఆఖరు సంవత్సరం చదువుతోంది. శారద పెళ్ళి వాళ్ళబావ శంకరంతో నిశ్చయమైంది. వాళ్ళిద్దరూ ఎప్పుడు చూచినా నవ్వుతూ, చెట్టాపట్టాలు వేసుకుని సినిమాలకీ షికార్లకీ వెళ్తుంటారు. తనుకూడా శారదలా చదువుకుంటూంటే .. కారుంటే ... ఎప్పుడూ ప్రక్కన తిరిగే బావ ఉంటే..." వాళ్ళను చూచినప్పుడల్లా శాంతి మనస్సులో ఉదయించే ఆలోచనలవి అంతటితో ఆలోచనలని కట్టేసి శారద ఇంటికి వెళ్ళింది శాంతి.

అద్దంముందు నించుని ఓరె కుచ్చిళ్ళు సరిచేసుకుంటోంది శారద. నెమ్మదిగా వెళ్ళి కొంగు లాగింది శాంతి. ఉలిక్కిపడి వెనక్కి తిరిగిన శారద "నువ్వా!" అంది దిగులుగా ఆశ్చర్యంగా

ఏం, శంకరం గారనుకున్నావా?.... ఎక్కడికేంటి ప్రయాణం?" అడక్కుండా ఉండలేకపోయింది శాంతి.

"బీచ్ కెళదాం త్వరగా రెడీ అయి ఉండమన్నాడు బావ" అంది శారద.

అంతలో గేటు దగ్గర కారు చప్పుడు కావడం శంకరం ఒక్క ఉదుటున లోనికి రావడం లిప్తపాటు కాలంలో జరిగిపోయాయి హుషారుగా ఈల వేసుకుంటూ వచ్చిన శంకరం, శాంతిని చూచి "ఈమెవరు?" అన్నట్టుగా చూశాడు ఆ చూపుల నర్థంచేసుకున్న శారద, "ఈమె నా స్నేహితురాలు శాంతి". "మా శంకరం బావ" శాంతి పరిచయం చేసింది శారద. అప్పుడే లోపలికొచ్చిన సుధాకర్ నూ పరిచయం చేసింది శారద. మగవాళ్ళతో పరిచయం లేని శాంతి సిగ్గు పడుతూ నించుంది.

"కూర్చుని మాట్లాడుతూండండి. రెండు నిమిషాల్లో కాఫీ పట్టుకొచ్చేస్తా" అని శారద

లోపలికి వెళ్ళింది.

"శాంతిగారూ, మీకు మాటల్రావా?" పలుకరించాడు సుధాకర్.

సమాధానం ఏమివ్వాలో తెలీక తల దించుకుని నవ్వుకుంది శాంతి.

"ఏమండీ, మీరు ఆ ఎదురింట్లోనే కదూ ఉంటున్నారు" మళ్ళీ సుధాకరే అడిగాడు. ఔనన్నట్టుగా తలూపింది శాంతి.

"ఏం చదువుతున్నారు?"

"ఎస్. ఎస్. సి. వరకూ చదివానండీ. తరువాత చదివించొద్దని మా బామ్మ పోరు పెడితే మాన్పించేశారు."

"మాతో బీచ్‌కి రండీ" ఆహ్వానించాడు సుధాకర్.

"బాబోయ్, మా బామ్మకు తెలిస్తే ఇంకేమైనా ఉందా" అమాయకంగా అంది శాంతి.

"అలాగా!" అని, మరేం మాట్లాడాలో తెలీక ఆగిపోయాడు సుధాకర్.

శారద కాఫీ పట్టుకొచ్చింది. కాఫీలయిన వెంటనే వాళ్ళు ముగ్గురూ బీచ్‌కి, శాంతి ఇంటికి వెళ్ళిపోయారు.

* * *

వారం రోజులు గడిచాయి. బామ్మగారికి దగ్గు ఎక్కువైంది. ఒకరోజు రక్తం పడడంతో వెంటనే హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. ప్రతిరోజు సాయంత్రం కాఫీ పట్టుకొని హస్పిటల్ కెళ్ళడం శాంతి డ్యూటీ అయింది.

ఆ రోజు సాయంత్రం సిటీబస్సులలో రష్ ఎక్కువగా ఉండడం వలన నడిచి వెళ్తోంది శాంతి. దారిలో సుధాకర్ కన్పించాడు "హలో శాంతిగారూ, మీరేమిటి.... ఇలా రోడ్డుమీద కన్పించడమేమిటి? మీ బామ్మగారూ...." ఆశ్చర్యపోతూ అడిగాడు సుధాకర్.

"బామ్మకు ఒంట్లో బాగులేదండీ. ప్రస్తుతం హాస్పిటల్‌లో ఉంది. అక్కడికే వెళ్తున్నా" అంది శాంతి హాస్పిటల్ వరకూ వెళ్ళాడు సుధాకర్.

మరుసటి రోజు హాస్పిటల్ నుండి త్వరగా వచ్చేస్తున్న శాంతి సుధాకర్‌ని చూచింది. దగ్గర్లోనే ఉన్న బీచ్‌కి వెళ్దామన్నాడు సుధాకర్. భయపడుతూనే వెళ్ళింది శాంతి. సుధాకర్ తన కాలేజీ విషయాలు....ఏ లెక్చరర్ని ఎలా ఏడిపించిందీ; ఎలాంటి పేర్లు పెట్టిందీ చెప్పి నవ్వించాడు శాంతిని. శాంతి తన ఇంటి విషయాలన్నీ చెప్పింది.

ఒకరోజు బీచ్‌లో............

"శాంతి నువ్వెప్పుడూ నా ప్రక్కన ఇలాగే ఉంటే ఇలాంటి ఎన్ని మహాసముద్రాలనైనా సునాయాసంగా దాటేయగల్ను. నీ సుఖం కోసం ఎలాంటి పనినైనా చేయడానిక్కి నేను సిద్ధం శాంతీ కాని నువ్వెప్పుడూ నా ప్రక్కన ఇలాగే నవ్వుతూ ఉండాలి..." ఏదేదో చెప్తున్నాడు సుధాకర్.

అరమోడ్పు కన్నులతో ఏ దూర తీరాలలోనో విహరిస్తున్న శాంతి ఏమీ మాట్లాడలేకపోయింది.

బామ్మగారు హాస్పిటల్‌లో ఉన్న నెల రోజుల్లో శాంతిలో ఎంతో మార్పు వచ్చింది. మనసంతా ఎప్పుడూ సుధాకర్ ధ్యాసతో నిండిఉండేంది. శారద ఇంటికి తరచుగా అలవాటైంది.

ఒకరోజు శాంత తల్లి రమణమ్మగారు అడగనే అడిగారు, "ఏమే, ఆ శారద ఇంటికి తరచుగా వెళ్ళొద్దని ఎన్నిసార్లూ చెప్పాన్నీకు? నిన్న నువ్వు నవ్వుతూ మాట్లాడుకుంటూ వస్తున్నావే ఆ కుర్రాడెవరు? మళ్ళీ ఆ యింటి ఛాయలకెళ్ళావంటే కాళ్ళిరగ్గొడ్తా జాగ్రత్త" అని వార్నింగ్ ఇచ్చింది.

శాంతి కళ్ళలో నీళ్ళు నిండాయి, "బాస్సెప్పు నవ్వుతూ మాట్లాడితే సహించలేరే మునలాళ్ళు, ఇంత ఛాదస్తంతో ఈ పెద్ద వాళ్ళ

నెలా పుట్టించావురా భగవంతుడా" అని వాపోయింది శాంతి.

ఉదయం నుండి ఇంట్లో అందరూ హడావుడిగా ఉన్నారు పెళ్ళిచూపుల కెవరో వస్తున్నట్లుగా తెలుసుకున్న శాంతికి ఏం చేయటానిక్కీ తోచలేదు అంతలో వాళ్ళు రానేవచ్చారు.

పెళ్ళిచూపు లైపోయాయి.

నల్లగా మొద్దులా ఉన్న రాజాని చూచి అసహ్యించుకుంది శాంతి. కాని తనకీ పెళ్ళి వద్దని ఎలా చెప్తుంది?

పెళ్ళిచూపుల విషయం సుధాకర్‌తో చెప్పింది శాంతి. "అలాగా" అని ఊరుకున్నాడు సుధాకర్. ఆ రోజు సుధాకర్ అదోలా ఉన్నట్టు గమనించింది శాంతి. ఆ విషయం తెలిసి బాధ పడుతున్నాడేమోనని సరిపెట్టుకుంది.

ఆ రోజు శాంతిని బీచ్‌కి తీసుకెళ్ళలేదు. సుధాకర్. అక్కడికి దగ్గర్లోనే ఉన్న తన స్నేహితుని గదికి తీసుకెళ్ళాడు. "ఎందుకు" అని ప్రశ్నించిన శాంతికి సమాధానంగా "నీతో చాలావిషయాలు మాట్లాడాలి శాంతి" అన్నాడు సుధాకర్, శాంతి మరేం మాట్లాడలేకపోయింది.

గది తాళం తీసి లోనికెళ్ళాడు సుధాకర్. శాంతిని లోనికి పిలిచాడు. యాంత్రికంగా లోని కెళ్ళింది శాంతి. గదిలో ఒక మూలగా మంచం, మరో ప్రక్క టేబిలు. కుర్చీలు. గోడలకు మంచి పెయింటింగ్స్ ఉన్నాయి. గది చాలా నీట్‌గా వుంది.

"శాంతి మంచినీళ్లు కావాలా" అడిగాడు సుధాకర్. అతని కంఠంలో ఒణుకును గమనించింది శాంతి. గోడలకున్న బొమ్మల్ని చూస్తూ సమాధానం ఇవ్వలేదు. ఈలోగా తలుపు గడియవేసి, ప్రక్కనే ఉన్న కూజాలోని నీళ్ళు గ్లాసులో పోసి ఇచ్చాడు శాంతి నీళ్ళు త్రాగుతోంది. వెనకనే ఉన్న సుధాకర్ శాంతి భుజం మీద చేయి వేశాడు. అతని వెచ్చని ఊపిరి ఆమె మెడను చురుక్కుమనిపించింది. శాంతి మంచినీళ్ళ గ్లాసు టేబిల్‌పై ఉంచి, "ఏమిటిది సుధా?" అని అడిగేంతలో. ఆమె అతని బాహువుల్లో బంధింపబడింది. తలుపు వేసి ఉండడం గమనించింది శాంతి. అతని దురుద్దేశం అర్థం చేసుకున్న శాంతికి కోపం తారస్థాయి నందుకొంది. "సుధా, ఇంత నీచుడవనుకోలేదు నువ్వు" అనుకుంది. అతన్ని దూరంగా త్రోసేసి తలుపు దగ్గరకువెళ్ళింది. సుధాకర్ తలుపుకు అడ్డంగా నించుని "ఏం ఫరవాలేదు శాంతీ...." అంటూ ఏదో గొణుగుతున్నాడు. మెరుపులాంటి ఉపాయం వచ్చింది శాంతికి.

"ఒక్కసారి బాత్‌రూంకెళ్ళి రావాలి సుధా" అంది.

ఉత్సాహంగా తలుపుతీసి ఎటు వెళ్ళాలో చెప్పాడు సుధాకర్.

గదినుండి బయట పడటంతోనే వీధిలోనికి పరుగెత్తి రిక్షాలో ఇల్లు చేరుకుంది శాంతి.

తరువాత మరెప్పుడూ ఆ స్తంభం దగ్గర

(మిగతా 64వ పేజీలో)



అనేక యోగ్యతా పత్రములు పొందిన

దివ్యౌషధం!

ఎందుకు గుర్తుకురావు? పిలిచిన వాళ్ళు ఏమన్నా అనుకుంటారేమోనని వెళ్ళక తప్పదు. కాని వారికి మాత్రం కనీసం ఒక్కసారైనావచ్చి ఎలావున్నారోనని పలకరించడానికే టైముండదు ఇలాంటివారిని చూస్తుంటే విసుగు, చిరాకు కలుగుతుంది. అందుకే ఒక్క శుభకార్యాల సమయాల్లో కాకుండా అన్నివేళల్లో బంధువులను, స్నేహితులను, ఇరుగు పొరుగును గుర్తు పెట్టుకుంటేమంచిది.

★

# "జవాబులేని ప్రశ్న"

(16 వ పేజీ తరువాయి)

కనిపించలేదు శాంతి. నెల్రోజులు తిరక్కముందే రాజా అర్ధాంగి అయింది.

పదిహేను సంవత్సరాలు గడిచాయి. స్వయం కృషితో వృద్ధిలోకొచ్చాడు రాజా. స్వంతంగా ఒకవర్క్‌షాపు పెట్టాడు. శాంతికి ఇద్దరు పిల్లలు. పెద్దది కళావతి. రెండోవాడు ప్రసాద్.

సంక్రాంతికి పిల్లల్తో పుట్టింటి కెళ్ళింది. ఇల్లంతా పిల్లల్తో హడావుడిగా ఉంది భోజనాలయ్యాయి. అంతా కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు తాంబూలం తయారు చేద్దామని చూసేసరికి వక్కపొడి డబ్బా ఖాళీగా కనిపించింది.

"కళా .... కళా .... ఎక్కడున్నావే, ఇట్రావే ఒకసారి వక్కపొడి తెద్దువుగాని అని వంట గదిలోనుండి నాలుగుసార్లు పిలిచింది శాంతి అయినా కళావతి రాక పోవడంతో ఎంచేస్తోందోనని బయటకు వచ్చి చూచిన శాంతికి అక్కడ కన్పించిన దృశ్యం మతి పోగొట్టింది. అందుక్కారణం కళావతి ఆ తెల్లటి స్తంభాన్నానుకొని రోడ్డుమొకి చూస్తూ నించోవడం. విపరీతమైన కోపం వచ్చింది శాంతికి.

"ఏమే. ఇప్పుడైతే నించున్నావు గాని, మరెప్పుడైనా ఆ స్తంభం దగ్గర నించోవడం చూశానంటే కాళ్ళు విరగ్గొడతా. జాగ్రత్త. లోపలికి "పో" అని హుంకరించింది శాంతి.

"ఏం? ఎందుకు నించోకూడదేంటి?" అని పౌరుషంగా అడిగిన కళావతికి సమాధానమేమివ్వాలో తెలియలేదు, గత స్మృతులతో మునిగిన శాంతికి. ★

# ఉత్తరాలు

(2 వ పేజీ తరువాయి)

ముందుకు సాగుతున్నవి ఇక యీ వారం కథల అన్నింటిలో "కన్నెవయసు" "దొంగతనం" ఎంతో ఇంపుగా ఉన్నవి. కవితలన్నీ చాలా బాగున్నాయి. సంపాదకీయం ప్రగతికి ఒక ఆణిముత్యం.

ముఖ్యంగా ప్రగతి పాఠకులకోసం ఇతర భాషలలో వైవిధ్యంగల మంచి మంచి కథలను ఎన్నుకొని విశ్వసాహితి క్రింద ప్రచురించి, పాఠకులను ఎంతో ఆనంద పరుస్తున్నారు అందుకు సంపాదకులకు మా హృదయ పూర్వక అభినందనలు.

సిరికొండ వెంకటేశం, సి. హెచ్.
అంజయ్య, కరీంనగర్.

Edited, Printed and Published on behalf of Naveenandhra Printing, Industrial and Agricultural Company (P) Ltd by M. Nagabhushauam, at Swatantra Art Printers, Vijayawada-4.